

# శిక్షణం!

కథా నిలయం
3946
శ్రీకాకుళం

ఎంత అన్యాయం జరిగిపోయింది ఒక్క క్షణంలో! తను మనిషా? కాదు కాదు రాక్షసుడు. మానవత్వమున్న మనిషైతే అలా చేసేవాడు కాదు. మానవత్వం నశించిన తర్వాత తను మనిషెట్లా అవుతాడు? విచిత్రం! తను అంత ఘోరంచేసినా యింకా బ్రతికే ఉన్నాడు. మానవులు సామాన్య పరిస్థితుల్లో చావాలనుకుంటారు. కానీ, మానవాతీతమైన పరిస్థితుల్లో చావాలనుకోరు. చస్తారు! తను అదీ చెయ్యలేక పోతున్నాడు. తానొక పశువు. అంతకన్నా హీనం దానికి తనకు ఏమిటి తేడా? సంబంధ బాంధవ్యాలు లేకుండా పశువు కామం తీర్చుకుంటుంది. తను అదేపని చేశాడు. ఇంక తను బ్రతికి ఏం లాభం? తను మళ్లీ ఆమె ముఖం ఎలా చూస్తాడు?

ఎంత ఘోరం చేశాడు! పాలు తాగిన రొమ్మునే గుద్దరా - అన్నట్లు తనకు మేలు చేసిన దేవతకే తాను ఎవరికీ చెయ్యరాని అన్యాయం చేశాడు. తనకు నిష్కృతి ఎట్లా ఉంటుంది? లేదు. లేదు.

'ఆమె తనను ఎంతగా నిందించుతున్నదో ! ఎంత నెమ్మదైన మనిషి ! ఎంతగా బ్రతిమాలుకుంది ! తిట్టింది, రక్కింది, పిడాట్లు పెట్టింది. తను వినిపించుకున్నాడా ? ఒట్టి పశువు! కాముకుడు ! నిజంగా కళ్లు మూసుకుపోయాయి. ఎలా కనిపిస్తుంది అంతస్థుల తారతమ్యం ?

'ఆమె ఎక్కడ ? తానెక్కడ ? తన్ను ఎంతగా ఆదరించేది ! భర్త ఉన్నా, లేకున్నా, తనను ఎలా సమాదరిస్తూ ఉండేది !

'నిజం ! అంతఃపురానికి ఎంత రక్షణ ఉంటే అంత మంచిది. స్త్రీ, పురుషునికి ఎంత దూరంగా ఉంటే అంత మేలు. ఊరికే చెప్పారా పూర్వులు ?

'ప్రతిరోజు వెళ్లుతూ ఉన్నాడు. అక్కయ్యా!' అని పిలుస్తూ ఉండేవాడు. ఎంత దుర్మార్గం చేశాడు ! ఆమె ఏమనుకుంటుంది ? అదంతా దొంగ వేషాలనుకోదూ ? 'అక్కలేని లోటు తీర్చావమ్మా' అన్నాడు. అప్పుడేమయింది ఆ భావన ?

'పాపం ! ఎంత దీనంగా మాపిందా చూపు ! అవన్నీ తను గమనించాడా ? ఆమె అందం ఉన్మత్తుణ్ణి చేసింది. బుద్ధిహీనుణ్ణి చేసింది. పాపిని చేసింది. తనకిక శాంతిలేదు. మోక్షం లేదు. భగవాన్! భగవాన్ !

జుట్టు పీక్కున్నాడు. తల నేలకేసి కొట్టుకున్నాడు. క్రిందటి సాయంత్రం నుంచి అలాగే గదిలో మంచంపై పడి ఉన్నాడు. స్నానం లేదు. సంధ్యలేదు. తిండీ లేదు. అలాగే పై కప్పుకేసి చూస్తూ పడున్నాడు. ఒకటే ఆలోచన సుళ్లు తిరుగుతూ ఉంది.

ముఖం పీక్కుపోయింది. కళ్లు లోపలికి వెళ్లాయి. కళావిహీనంగా ఉంది ముఖం. ఏడ్చి ఏడ్చి గొంతు రాసిపోయింది. ఎంత ఏడిస్తే ఏం లాభం ? అతను చేసిన పాపం ఆ కన్నీరు క్షాళనం చేస్తుందా ?

ఆలోచించి, ఆలోచించి, ఒక నిశ్చయానికి వచ్చాడు. హఠాత్తుగా మంచం నుంచి లేచాడు. ఇల్లు తాళం వెయ్యలేదు. అలాగే రోడ్డువెంట పోతున్నాడు. గుడ్డలన్నీ బాగా నలిగిపోయాయి. జుట్టు రేగి ఉంది. తెలిసినవారు దిగ్భ్రాంతులై చూస్తున్నారు. తెలియనివారు పిచ్చివాడనుకున్నారు, త్రాగుబోతనుకున్నారు. వీధిచివర్లో ఓ కుక్కకూడా మొరిగింది. అతడివన్నీ ఏమీ పట్టించుకోలేదు.

వెళ్లాడు. సరాసరి ఆమె ఇంటికే వెళ్లాడు. ఇంట్లో దీపాలు వెలిగించి లేవు. ఆమె మనస్సులాగే ఆ ఇల్లూ అంధకారబంధురమై ఉంది. ఇల్లు నిశ్శబ్దంగా ఉంది. ఆమె మనస్సులాగే అది మూగనోయి ఉందేమో !

ఒక్క క్షణం నిలిచి తలుపు త్రోసుకుని లోపలికి వెళ్లాడు. నెమ్మదిగా వెళ్లితే మసక చీకట్లో ఆమె గోడనానుకుని కూర్చున్నట్లు కనిపించింది. లైటు స్విచ్చి వేశాడు. చూచాడు. ముఖం వాడిపోయి ఉంది. చెక్కిళ్లపై కన్నీటి చారలు కన్పిస్తున్నాయి.

ఏడ్చి ఏడ్చి కండ్లు ఉబ్బినాయి. ఆవేదనతో వక్షస్థలం ఎగిరి పడుతుంది. 'ఆ వేదన' మనస్సులోనే ఉండి, దాన్నే కాలుస్తూ ఉందేమో ! కళ్లల్లో అది కనరావటం లేదు. నిశితంగా చూస్తే కళ్లల్లో నిర్లిప్తత, మహావేదన అగుపడతాయేమో!

చూడలేకపోయాడు. లైటు ఆర్పివేశాడు. నెమ్మదిగా వెళ్లాడు. ఆమె కాళ్ల దగ్గర మోకాళ్లపై కూర్చుని నెమ్మదిగ నేలకు కరుచుకుపోయి ఆమె పాదాలపై పడ్డాడు. మొదట ఆమె కాళ్లు వెనక్కు లాక్కున్నట్లు అనిపించింది. కానీ, తర్వాత ఆ ప్రయత్నం ఏమీ చేసినట్టు లేదు.

వెక్కి వెక్కి ఏడుస్తున్న శబ్దం మాత్రం వినిపిస్తూ ఉంది. చీకటి అయినా, రెండు గొంతుకలు లేవు కాబట్టి ఎవరో ఒకరే ఏడుస్తూ ఉండాలి !

నెమ్మదిగ వినిపించింది. "లే! రాజా, ఆ లైట్ వెయ్!" ఆ గొంతులో ఏ విధమైన అసహ్యమూ లేదు. ఆనందమూ లేదు. ఆగ్రహమూ లేదు. ఆవేశమూ లేదు. ఏదో భరింపరాని నిర్లిప్తత ఉంది. ఆ నిర్లిప్తతే మనస్సున్న వాళ్ల మనస్సును రంపపుకోత పెడుతుంది. మహావేదన నిండి ఉంది ఆ గొంతుకలో.

అతను లైటు వేశాడు. ఈసారి ధైర్యం చేసి ఆమె వైపు చూడలేకపోయాడు. తలవంచుక కూర్చున్నాడు. కన్నీటి చారలు కనిపిస్తూనే ఉన్నాయి.

ఆమె మెల్లగా లేచి వెళ్లింది. స్నానాలగదిలోకి వెళ్లి స్నానం చేసి వచ్చింది.

"రాజా!"

అతను తలెత్తి చూశాడు. అదే చీర. అదే రవిక. అదే ముఖం. అదే అందం. క్రిందటి రోజు ఏవైతే తన్ను ఆకర్షించి తనచేత చెయ్యరాని మహాఘోరం చేయించాయో, అవే ఈరోజు తనను విచారగ్రస్తుణ్ణి చేస్తున్నాయి. నిన్న అవే తనకు పరవశత్వం కల్గించి కామోద్రిక్తుణ్ణి చేస్తే, ఈ రోజు అవే తనను విచారగ్రస్తుణ్ణి చేసి దుఃఖితుణ్ణి చేస్తున్నాయి. ఒక్కరోజులో ఎంత తేడా! ఆ ఒక్క క్షణం ఎంత భయంకరమైంది !

క్షణకాలం ఆమెవైపు చూసి చూడలేక తలవంచుకున్నాడు.

మెల్లగా దగ్గరకు వచ్చింది. అతని భుజంపై చేయివేసింది. ఎన్నడూ అతన్ని తాకి ఎరుగదు.

"రాజా! లే! రైలుకి వేళవుతుంది. నావద్ద నగలూ, డబ్బూ అన్నీ కలిసి సుమారు అయిదారు వేలున్నాయి. హైదరాబాద్ పోదం. అక్కడే ఉందాం" అంది.

ఆ గొంతులో కోపం లేదు. కామం లేదు. శాంతం ఉంది. ప్రేమ ఉంది. ఆవేశం లేదు. అనురాగం ఉంది, అన్నిటినీ మించి ఆ మాటల వెనక గాఢమయిన నిశ్శబ్దత ఉంది.

క్రుంగిపోయాడు. ఆమె ఎంత శీలవతి ! ఎంత సుగుణవతి ! నిప్పులాంటి మనిషి. ఎలాంటి మాటలు అంటున్నది ! కారణం ? తను. తన్ను కాల్చినా పాపం లేదు. తనను కాలిస్తే పాపం పోతుందా ? ప్రాణం పోతుంది. ఈ శరీరానికి సంబంధించిన వేదన పోతుంది. మనస్సుకు, ఆత్మకు చుట్టుకున్న వేదన ఎలా పోతుంది ?

ఆమె కాళ్లు పట్టుకుందామనుకున్నాడు ఛీ ! ఛీ ! ఆమె తన అపవిత్ర చర్యతో స్పర్శతో కళంకిని అయింది. ఆమె పాతివ్రత్యమంతా మంట కలిసింది. ఇంకా ఆమెను అధఃపతితను చేయాలా?

"శశక్కా! నన్ను క్షమించక్కా ! ఇంకా నేను బ్రతికి ఉన్నాను. పాపిని. ఇంక మళ్లీ ఇటు రాను, చెపుతున్నానక్కా! నిజం ! నీవు ! నీవు......." అతను ఆ తర్వాత మాట్లాడలేకపోయాడు. మనస్సున సంతోషం నిండుకుంటే ఎలా మాటలు రావో ఆవేదన ఆవరించుకున్నా అలాగే రావు.

"ఏమంటున్నావ్, రాజా ? నేను మళ్లీ వారితో కాపురం చెయ్యాలా ? వారితో మళ్లీ ఎలా కాపురం చెయ్యగలను ? అది సాధ్యమా ? నాకు మాత్రం కాదు. ఇదిగో, వారితో కాపురం చేసినందుకు ఫలంగా, ఆ బాబు, బేబి వారికి చాలు. నా యీ కళంకమైన జీవితంతో, శరీరంతో వారికి మచ్చ తేలేను. మళ్లీ ఆయనను మభ్యపెట్టి ఈ అగ్నిగోళాన్ని నాలో దాచుకుని నాలో నేను కృశించలేను ఎక్కువ మాటలు పనిలేదు. వెళ్దాం పద."

ఆమె గొంతులో కదలిన వేదన స్పష్టమౌతున్నదా మాటల్లో. ధృఢనిశ్చయమైన ఆమె గొంతులో మాటలు కరకుగనే దొర్లుతున్నవి.

సూట్ కేసు తీసుకుంది.

"అమ్మా! నేను రా......."

మనసు మారిపోతున్నప్పుడు మనిషిని పిలిచే పద్ధతీ మారిపోతుంది కాబోలు.

సూట్ కేసు జారిపడింది.

"రాలేవా ? నాకు తెలుసు, రాజా, నీవు రాలేవని." అలాగే గోడకు చేరగిలబడింది.

"క్షణిక వ్యామోహం ఎంత పని చేస్తుంది ! ఇద్దరి జీవితాల్లో నిప్పులు చెరిగింది. ఇద్దరి జీవితాలు నాశనమయ్యాయి. ఒక్క సంగతి జ్ఞప్తికి ఉంచుకో, రాజా ! ఆడది సుఖంగా అనుభవించి అవతల పారవేసే వస్తువు కాదు. నీవు నాకు ఇహమూ, పరమూ లేకుండా చేశావు. పరము పోతే పోయింది. ఇహమైనా దక్కించుకుందామనుకుంటే అదీ దూరం చేస్తున్నావు. నిన్నని లాభం లేదు రాజా ! ఒక విధంగా మేలే చేస్తున్నావు. తప్పు చేశామని తెలిసి ప్రాణంపై తీపితో మళ్లీ మళ్లీ ఆ తప్పు చేస్తూనే బ్రతకాలనుకోవటం అవివేకం. ఆ పని చేయకుండా కాపాడుతున్నావు. ఇక పరమునే వెతుక్కుంటాను. వెళ్లు బాబూ, వెళ్లు."

నిశ్శబ్దంగా బయటికి నడిచి వెళ్లాడు. వెళ్లేప్పుడు ఆమె వైపు చూద్దామనుకున్నాడు. ధైర్యం చాల్లేదు.

ఓ గంట గడిచింది. ఏం నిశ్చయానికి వచ్చిందో లైటార్పివేసింది. కట్టుకున్న చీరమార్చి నగలన్నీ తీసివేసింది. పిల్లలను ఇద్దరినీ ఓమాటు గట్టిగా ముద్దు పెట్టుకుంది. చెంటిది కన్నీళ్లు చెక్కిలిపై పడితే అటూ ఇటూ కదిలి చెంపలు తుడుచుకుంది. పిల్లవాడు మూల్గి అటుతిరిగి పడుకున్నాడు. దుఃఖంతో గొంతులోంచి సన్నగా జీర వస్తున్నది. ఎదురుగా ఉన్న భర్త ఫొటో హృదయానికి హత్తుకుంది. కన్నీటి బొట్టొకటి రాలింది. అక్కడే ఉన్న పంచెతో తుడిచి, తిరిగి అక్కడే తగిలించి, కడసారిగా నమస్కరించి బయటికి నడిచింది.

తలుపు తాళం వేసి, తాళం చెవి తలుపు దగ్గరగా లోపల వేసి బయల్దేరింది. నిండుగా చెరుగు కప్పుకొంది. ఎక్కడో పదకొండు కొట్టారు.

అమావాస్య చీకటి. చకచక నడుస్తూ పోతూ ఉంది. కార్నర్ వద్ద రిక్షావాళ్లు ఎగాదిగా చూశారు. ఏదో గొణుక్కున్నారు. తుంగభద్రవైపు వెళ్లుతూ ఉంటే దేవాలయం వద్ద పడుకున్న ముసలిది చూసి "ఎవరో" అని గొణిగి మళ్లీ ఒరిగింది.

అటూ ఇటూ చూచింది. ఎవరూ లేరు. అలా తేరిపారచూస్తే ఫర్లాంగు దూరంలో ఎవరో వ్యక్తి మెల్లమెల్లగా గులకరాళ్లు ఏట్లోకి విసురుతున్నట్లు ఉంది. నిశ్శబ్దంలో అవి 'బుడుక్! బుడుక్! అని చేసే శబ్దం బాగా స్పష్టంగా వినిపిస్తున్నది.

మళ్లీ అటూ ఇటూ చూచి మనస్సులో ఏదో అస్పష్టంగా గొణుక్కుంది. భగవంతుణ్ణే ప్రార్థించిందేమో బహుశా ! గభాలున దూకేసింది.

దూరంగా కూర్చున్న వ్యక్తి పరుగెత్తుకుంటూ వచ్చి అటూ ఇటూ చూసి ఎవరూ లేకపోవటంతో దిక్కుతోచక గభాలున దూకేశాడు.

పాపం దూకిన తర్వాత అతనికి తెలిసింది, అక్కడో సుడి ఉందని, అతని పెదవులపై మందహాసం కాని మందహాసం విరిసింది. రక్షించబోయి తాను చస్తున్నానని అనుకున్నాడు. ఒక్క మునక వేసిన తర్వాత ఏదో గొణిగాడు. బహుశా "శశి ఇకనైనా నన్ను క్షమిస్తుంది లే"నని కావచ్చు. అతనికి చిత్రంగా ఆ క్షణంలో అనిపించింది, తాను శశి అక్కయ్య కొడుగ్గా పుడతానేమోనని ! నవ్వటానికి కూడా వీల్లేకుండా సుడి ముంచేసింది.

విధి విడదీస్తే సుడి కలిపేసింది !

● 5-6-63 ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక ●